సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 7 । జూలై । 2025



యువకుడు దారుణ హత్య

కొత్తూరు మండలం వసపలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. - 8లో



డిగ్రీ ప్రవేశాలకు మోక్షమెప్పుడు

డిగ్రీ ప్రవేశాలకు నానాటికీ ఆలస్యమవుతున్నాయి. ఇప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. - 8లో



తొలి ఏకాదశి సందడి

ఆదిత్యుని సన్నిధిలో తొలి ఏకాదశి సందడి నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

తహసీల్దార్ కార్యాలయంలోనికి వర్షపు నీరు



కంప్యూటర్ గదిలో ఉన్న వర్షపు నీరు

సారవకోట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ మాత్రం వాన కురిసినా నీరు కార్యాలయం లోపలకు వచ్చేస్తోంది. శని, ఆదివారాల్లో చిన్నపాటి వర్షం కురవడంతో కార్యాలయపు కంప్యూటర్ గదిలోకి నీరు చేరడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీరు లోపలకు రావడంతో ముఖ్యమైన కంప్యూటర్ పరికరాలు, పత్రాలు తడిసి పోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు.

'వీఆర్‌ఏలతో వెట్టిచాకిరీ తగదు'



మాట్లాడుతున్న రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీకిసాహెబ్

ఆమదాలవలస: పార్ట్‌టైమ్ పేరుతో వీఆర్‌ఏలతో వెట్టిచాకిరీ చేయించడం ప్రభుత్వానికి తగదని రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీకిసాహెబ్ అన్నారు. వీఆర్‌ఏల సంఘం శ్రీకాకుళం ఏడో జిల్లా మహాసభ ఆమదాలవలసలో టి.త్రినాథరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఫుల్ టైం విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేస్తోందని తెలిపారు. ఇక్కడ కూడా పే స్కేల్ అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9 దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 46 కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను పోరాటాలతోనే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా అల్లు సత్యనారాయణ, అధ్యక్షుడిగా టి.త్రినాథరావు, ఉపాధ్యక్షుడిగా ఎన్.సీతప్పుడు తదితరులను ఎన్నుకున్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సేవల్ని దేశప్రజలు ఎన్నడూ మరిచిపోలేరని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అరసవల్లి కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ప్రధానిగా అనేక సంస్కరణలు చేసి బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ రుషి, రాష్ట్ర కళింగ కోమటి మాజీ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, సంఘ సంస్కర్త మంత్రి వెంకటస్వామి, రాష్ట్ర పెన్షనర్స్ అండ్ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ బుక్కూరు ఉమామహేశ్వరరావు, డాక్టర్ సెల్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ పట్నాయక్, అరసవల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ జలగడుగల శ్రీనివాసరావు, పట్టణ విభాగం కార్యవర్గ సభ్యుడు అర్జి ఈశ్వరరావు, శోభన్, త్రినాథ, కడియం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

మందస: కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా మందస మండలం రాంపురంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు దున్న రామారావు నేతృత్వంలో ఆదివారం లక్ష సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా రైతు మాట్లాడుతు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఎయిర్ పోర్టు నిర్మాణం తగదన్నారు. రాజకీయాలకు అతీతంగా భూములను మాత్రం ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.

ఇదేం తీరువా..?



టెక్కలి మండలం రావివలస సమీపంలో మరమ్మతులకు గురైన సాగునీటి కాలువ డ్రాప్‌లు

- సాగులో పెట్టుబడుల సమయాల్లో నీటి తీరువా వసూళ్లు
- పెట్టుబడి సాయం అందజేయకపోగా నీటి తీరువా వసూళ్లకు ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా రూ.24,21,69,367 వసూళ్లకు టార్గెట్
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

టెక్కలి:

అన్నదాతను ఎన్ని విధాలుగా వేధించాలో కూటమి సర్కారు అన్ని విధాలుగా వేధిస్తోంది. తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరుతో ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ఎన్నికల మునుపు చంద్రబాబు హామీ ఇచ్చారు. పాలన రెండో ఏడాదికి చేరుకున్నా ఒక్కసారి కూడా ఈ సాయం అందజేయలేదు. రైతులకు పెట్టుబడి సాయం అందజేయకపోగా మరోవైపు నీటి తీరువా పన్ను చెల్లించాలని రైతుల నెత్తిన కొత్త భారం వేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభమై రైతులంతా పెట్టుబడుల కోసం తిరుగుతూ వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నీటి తీరువా వసూళ్ల కోసం అధికారులు ఆదేశాలు జారీ చేయడంపై రైతులు మండిపడుతున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు వద్దకే సంక్షేమ పథకాలు అందజేశారని, ఇలా రైతులను పన్నుల పేరుతో ఇబ్బందులకు గురి చేయలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. వాస్తవంగా రైతులకు 140 రోజుల పాటు పూర్తి స్థాయిలో సాగునీటితో పాటు కాలువల మరమ్మతులు చేసినపుడే నీటి తీరువా వసూలు చేయాలని, అలా కాని పరిస్థితుల్లో ఎలాంటి వసూలు చేయకూడదని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.



నీటి తీరువా కట్టాల్సిందే..

జిల్లా వ్యాప్తంగా రైతులు నీటి తీరువా పన్ను కట్టాల్సిందేనంటూ రూ. 24,21,69,367 టార్గెట్‌ను అధికారులు ఫిక్స్ చేశారు. ఈ లక్ష్యం చేరుకునేందుకు అధికారులు రైతులను ఇబ్బంది పెట్టక తప్పని పరిస్థితి దాపురించింది. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోగా వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న తరుణంలో ఇలా పన్నుల వసూలుకు ఆదేశాలు ఇవ్వడం మంచిది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిస్తు వసూలు చేయాలనుకుంటే డిసెంబర్ చివరి నుంచి జనవరి మధ్యన టార్గెట్‌లు పెట్టుకోవాలి తప్ప ఆరంభంలో వసూలు చేయడమేమిటని నిలదీస్తున్నారు.

తీరువా వసూళ్లు అన్యాయం



రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడుల కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయాల్లో నీటి తీరువా వసూలు చేయడం అన్యాయం. వాస్తవంగా సాగునీటి కాలువల నుంచి సుమారు 140 రోజుల పాటు పుష్కలంగా సాగునీరు అందజేస్తే తప్ప నీటి తీరువా వసూలు చేయకూడదు. ఇక్కడ ఆ పరిస్థితి లేకపోయినప్పటికీ వసూళ్లకు టార్గెట్‌లు పెడుతున్నారు. వసూలు చేయాలనుకుంటే రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీటి సదుపాయం కల్పించాలి.

– పోలాకి ప్రసాదరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

వసూళ్లు మానుకోవాలి



గత ప్రభుత్వంలో రైతులకు ఇంటి ముంగిటకే అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు అందాయి. ఈ కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పెట్టుబడి సాయం ఇవ్వకపోగా నీటి తీరువా వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి పన్నులు వసూళ్లు చేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ పనులకు అవసరమైన పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

– జె.యర్రన్నరెడ్డి, రైతు, బూరగాం, టెక్కలి మండలం.

జిల్లాలో డివిజన్ల వారీగా నీటి తీరువా వసూళ్ల టార్గెట్ ఇలా...			
డివిజన్	శ్రీకాకుళం	టెక్కలి	పలాస
మొత్తం ఖాతాలు	3,14,101	2,17,191	1,78,469
డిమాండ్(రూ.ల్లో)	15,57,70,103	5,44,48,504	3,19,50,760

సిక్కోలు బిడ్డ జాడ ఏదీ..?

- పాశమైలారం సిగాచీ కంపెనీ పేలుడులో జిల్లా వాసి వెంకటేష్..?
- వారం రోజులైనా వివరాలు ఇవ్వని వైనం
- తల్లడిల్లిపోతున్న తల్లిదండ్రులు



రోదిస్తున్న తల్లి పద్మావతి

జి.సిగడాం: తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి కంపెనీ పేలుడు ఘటనతో జి.సిగడాం మండలం పాలఖండ్యాం పంచాయతీ జగన్నాథపురం ఉలిక్కిపడింది. ఈ గ్రామానికి చెందిన గుండుపిల్లి వెంకటేష్ (29) ఇదే కంపెనీలో పనిచేస్తుండడం, పేలుడు జరిగిన రోజు డ్యూటీకి వెళ్లడం, వారం రోజులుగా ఇంటికి ఏ సమాచారం లేకపోవడం, కంపెనీ తరవు వారు కూడా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో తల్లిదండ్రులు తమ బిడ్డకు ఏం జరిగిందో తెలీక తల్లడిల్లిపోతున్నారు. గ్రామానికి చెందిన గుండుపిల్లి చిన్నారావు, పద్మావతిల కుమారుడు వెంకటేష్ రసాయన శాస్త్రంలో పీజీ చేశాడు. పాశమైలారం సిగాచి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 30న ఉదయం 9 గంటల సమయంలో కంపెనీలో భారీ పేలుడు సంభవించడంతో 40 మందికిపైగా మృత్యువాతపడ్డారు. ఈ వార్త విన్నప్పటి నుంచి చిన్నారావు, పద్మావతిలకు నిద్ర లేదు. తక్షణమే వెంకటేష్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో హుటాహుటిన హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. అక్కడ మృతదేహాలను చూసేందుకు కూడా వీల్లేని స్థితి ఉండడంతో ఏం చేయాలో పాలుపోలేదు. డీఎన్‌ఏ పరీక్షలు చేసి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. వెంకటేష్‌కు సంబంధించిన వివరాలు మాత్రం ఇప్పటివరకు లభ్యం కాలేదు.

ఇంటికి వస్తానని చెప్పి..

గత నెల 30న ఉదయం 6.06కు వెంకటేష్ డ్యూటీకి వెళ్లాడు. ప్రధాన గేట్ వద్ద వెంకటేష్ సంతకం పెట్టినట్టు కూడా ఉంది. అలాగే కంపెనీ వారు జారీ చేసి ఎ షిఫ్ట్‌లో ఉన్న వారిలో 154 నంబర్‌లో అతడి పేరుంది. అదే రోజు ఉదయం 5 గంటల సమయంలో వెంకటేష్ ఇంటికి ఫోన్ చేసి 'అమ్మ నేను ఉదయం డ్యూటీతో పాటు అ దనంగా మరో డ్యూటీ చేసి మంగళవారం రైలెక్కి ఇంటికి వస్తాను' అన్నాడని తల్లిదండ్రులు తెలిపారు. బాబుకు ఏమైందో తెలీడం లేదని, పే లుడు సంభవించిన నాటి నుంచి ఫోన్ కూడా చేయడం లేదని వారు బోరున విలపిస్తున్నారు. ఘటన జరిగి వారం రోజులైంది. ఇన్ని రోజులుగా వెంకటేష్ తల్లిదండ్రులు ఎదురు చూస్తూనే ఉన్నా రు. ఆ కంపెనీలో మరో 9 మృతదేహాలు ఉన్నా యి. వీటికి డీఎన్‌ఏ పరీక్షలు చేసి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. వేరే చోట కూడా మృతదేహాలు కాలిపోయిన స్థితిలో ఉన్నాయి.



వెంకటేష్ (ఫైల్)

ప్రభుత్వం చొరవ లేదు

ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన 9 మంది చనిపోయారు. వీరి కోసం ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టడం లేదని జిల్లా వాసులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటికి వస్తానన్నాడు..

అమ్మా నీకు నడుముకు ఆపరేషన్ అయ్యిందా..? నేను మంగళవారం రైలెక్కి బుధవారం ఇంటికి వస్తాను అని ఫోన్ చేసి చెప్పాడు. 30వ తేదీ ఉదయం 5.30 గంటలకు నాతో మాట్లాడాడు. 9 గంటల సమయంలో ఆ కంపెనీలో పేలుడు జరిగినట్టు టీవీలో చూశాం. బాబుకు ఫోన్ చేసినా కలవలేదు. కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ వెళ్లారు.

– పద్మావతి, వెంకటేష్ తల్లి

ఎదురుచూస్తున్నాం



సిగాచి కంపెనీలో పనిచేస్తున్న అన్న ఆచూకీ కోసం కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, తోబుట్టువులు ఎదురు చూస్తున్నారు. రెండు రోజుల్లో ఇంటి వస్తాను అన్నవాడు ఇంత వరకు ఏమయ్యాడో తెలీడం లేదు.

– అనిత , వెంకటేష్ చెల్లి

బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



ప్రభుత్వ వైఫల్యాలపై సమర భేరి



సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- సర్కారు మోసాలను ఎండగడదామని వైఎస్సార్ సీపీ నాయకుల పిలుపు
- కవిటిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' సభ
- సభతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

కవిటి:

సూపర్ సిక్స్ పథకాలతో పాటు 143 వాగ్దానాలు ఇచ్చి వాటి అమలులో ఘోరంగా విఫలమైన ప్రభుత్వంపై సమర భేరి మోగిద్దామని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్, పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. కవిటిలో ఇచ్ఛాపురం నియోజక వర్గ స్థాయిలో రెండో దశ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' సభను మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కంచిలి జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులంతా ఐక్యంగా ముందుకుసాగితే ఇక్కడ ఏ దుష్టశక్తులు ఎదురునిలబడలేవన్నారు. సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండల ఎంపీపీలు డాక్టర్ ఎన్.దాస్, పద్మప్రకాష్, దేవదాస్ రెడ్డి, బోర పుష్ప ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దారుణంగా విఫలమైందన్నారు. సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై వ్యవస్థాగతంగా అన్నివర్గాల ప్రజల్ని సంఘటితం చేయాలన్నారు. కార్యక్రమంలో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, మున్సిపాలిటీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ క్రియాశీల కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక పాలన



రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న మోసపూరిత విధానాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. కూటమి నేతల బెదిరింపులకు భయపడే పరిస్థితి లేదు.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

రెడ్‌బుక్ రాజ్యాంగం దారుణం



స్వతంత్ర్య భారత చరిత్రలో ఏ నాయకుడూ చేపట్టని విధంగా ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీకాలింగ్ బాబూ మేనిఫెస్టో అనే కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయం. ఇందుకోసం ఓ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్నాం. ఐదు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. మండల, గ్రామస్థాయిలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రశ్నించే గొంతులపై రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం దారుణం.

– కుంభా రవిబాబు, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు

పాలనలో సమర్థత లేదు



ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని కూడా సమర్థంగా అమలు చేయలేకపోయింది. కొత్త పెన్షన్ల కోసం వృద్ధులు, వితంతువులు ఆవేదనతో ఎదురు చూస్తున్నారు. గ్యాస్‌పథకం రాయితీలను కూడా అరకొరగానే అందిస్తున్నారు. సవాలక్ష ఆంక్షల మధ్య తల్లికి వందనం చాలా మందికి అందలేదు. మత్స్యకార భరోసాలో ఎందరో అర్హులైన అమాయకులకు పథకం అందకుండా పోయింది.

– ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు

ప్రజాధనం లూటీ చేశారు..



ఏడాది పాలనలో ప్రజాధనం లూటీ చేశారు. ఉర్సా వంటి కంపెనీలకు కారుచౌకగా భూములు కట్టబెట్టారు. రాష్ట్రంలో నారా వారి సారా స్రవంతి సుజల స్రవంతిలా ఏరులై ప్రవహిస్తోంది. బెల్టుషాపులకైతే లెక్కే లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రానికి మంజూరైన 17 కళాశాలల్లో ఐదు చోట్ల సీట్లను కూటమి నాయకులు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు.

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

శ్రేణులకు అండగా ఉంటాం



రాష్ట్రంలో, నియోజకవర్గంలో కూటమి అనుసరిస్తున్న విధానాల్లో తేడా లేదు. పార్టీ శ్రేణులకు అధినాయకత్వం అండగా ఉంటుంది.

– పిరియా సాయిరాజ్, సభాధ్యక్షుడు

రైలు ఢీకొని 13 పశువులు మృతి



రైలు ఢీకొని మృతి చెందిన పశువులు

పాతపట్నం: మండలంలోని హరిద్వారం గ్రామానికి చెందిన ఏడుగురు పాడి రైతులకు చెందిన 13 పశువులు ఆదివారం రైలు ఢీకొని మృతి చెందగా, మరో నాలుగు పశువులకు తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం ఉదయం 12 గంటల ప్రాంతంలో హరిద్వారం గ్రామానికి చెందిన పశువులను అదే గ్రామానికి చెందిన గోగ్గి లక్ష్మినారాయణ మేతకు తీసుకుపోయారు. హరిద్వారం, బొమ్మిక గ్రామాల మధ్య రైల్వేట్రాక్‌ను పశువులు దాటుతుండగా పూరి నుంచి గుణుపూర్ (ప్రత్యేక రైలు) రైలు ఢీకొని 13 పశువులు మృతి చెందాయని, మరో ఐదు పశువులకు తీవ్రగాయాలయ్యాయని పాడి రైతులు తెలిపారు. హరిద్వారానికి చెందిన లోకలాపు ఆదినారాయణకు చెందిన ఆరు, బోదుడు సోములకు చెందిన రెండు, గొగ్గి శిమ్మయ్య, కలగ రమేష్, బొమ్మాళి అప్పలరాజు, ఎన్ని పాపారావు, బొడ సింగిరిడికు చెందిన ఒక పశువు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలానికి పశుసంవర్ధశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని పాడి రైతులు కోరారు.

టీకా తప్పనిసరి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

చికిత్స లేని వ్యాధికి చైతన్యమే చక్కని పరిష్కారమని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రాజగోపాలరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం వెటర్నరీ పోలీ క్లినిక్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లూయీ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జేడీ సూచించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో కుక్కలకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీపీసీ డీడీ డాక్టర్ గణపతిరావు, ఏడి డాక్టర్ వై.వి కృష్ణారావు, డీఎల్‌డీఏ డీఓ డాక్టర్ సత్యప్రకాష్, వీఏఎస్ డాక్టర్ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో టీకాలు వేయించేందుకు పెంపుడు జంతువులను తెచ్చిన యజమానులు



టీకా వేస్తున్న దృశ్యం



క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లానాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను, పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బి.రవి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. నాడు–నేడుతో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తిచేయాలని కోరారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌ల పేరిట బడుల్లో విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. గిన్నిస్‌రికార్డుల కోసం ఆరాటమే తప్ప విద్యాభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ అధ్యక్షులు టి.చలపతిరావు, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, బాలాజీరావు, ఆర్.వి.అనంతాచార్యులు, బి.నవీన్, కృష్ణారావు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్ తగదు



పిట్టా దామోదరరావు

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు ట్రోలింగ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయ వ్యవస్థలో భాగమైన ఉన్నత న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్నా ట్రోలింగ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు.వ్యక్తి కంటే వ్యవస్థలే ముఖ్యమని, అటువంటి వారిని అవమానిస్తే, న్యాయవ్యవస్థను అవమాన పరిచినట్లేనని పేర్కొన్నారు. ట్రోల్ చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించించాలని కోరారు.

ఉత్సాహంగా చెస్ ఎంపిక పోటీలు



చెస్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో రాణించి జిల్లాకు పేరుతీసుకురావాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్ ఆకాంక్షించారు. జిల్లాస్థాయి అండర్–15 చెస్ ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు పాల్గొని ఎత్తుకు పైఎత్తులేశారు. బాలుర విభాగంలో డొంకాడ కార్తికేయ ప్రథమ, బొల్ల యశ్వంత్ ద్వితీయ, ఎస్‌కేపీ నిహాల్ తృతీయ, పొన్నాడ వేదిష్ నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో మెట్ట తీక్షణ, బొల్ల శృతి, జామి వినమ్ర, రిత్విక తొలి నాలుగు స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీలలో విశాఖపట్నంలో జరిగేరాష్ట్ర స్థాయి అండర్– 15 చెస్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ ఇండియా చెస్‌ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘ కార్యదర్శి జామి రమేష్, సంయుక్త కార్యదర్శి వై.ఎస్.వి.కుమార్, కోచ్ అభినవ్, అసోసియేషన్ సభ్యులు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నందిగాం: రాంపురం పంచాయతీ జయపురం గ్రామానికి చెందిన రాంపురం రత్నాలు(54) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రత్నాలుకు కంటి సమస్యతో బాధపడుతోంది. భర్త మహేష్ విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అన్ని పరీక్షలు చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్థాపం చెందిన శనివారం అర్ధరాత్రి పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ కన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు మోక్షమెప్పుడో?



- ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు
- కనీసం దరఖాస్తులు చేసుకోవడానికి సైతం షెడ్యూల్ విడుదల చేయని వైనం
- విద్యార్థుల భవితవ్యంతో ఆటలాడుకుంటున్న కూటమి సర్కారు



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై మూడు నెలలు గడిచాయి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సైతం విడుదలై నెల రోజులైంది. అయినా డిగ్రీ ప్రవేశాలకు మాత్రం మోక్షం కలగడం లేదు. కూటమి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో ప్రవేశాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలలో ఉన్నత విద్యాశాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గత ఏడాది ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో ప్రభుత్వ కళాశాలల్లో వందలాది సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది అంతకుమించిన



తరగతి గదిలో డిగ్రీ విద్యార్థులు

దుస్థితి తలెత్తుతుండటంతో కళాశాలల యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు డిగ్రీలో చేరాలనుకుంటున్న విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. కొంతమంది ప్రైవేటు కోర్సుల బాట పడుతున్నారు.

ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా ?

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలను గతంలో కళాశాల యూనిట్‌గా నిర్వహించేవారు. ఎంపిక చేసిన కళాశాలల్లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకుని, సీటు లభించిన కళాశాలలో చేరే వారు. ఇంటర్మీడియెట్ మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించేవారు. 2020 నుంచి ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం యూనిట్‌గా విద్యార్థులు వెబ్‌బేస్డ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకునేవారు. మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు లభించేవి. ప్రైవేట్ కళాశాలలో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు ప్రభుత్వ రాయితీలైన ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లు వంటివి వర్తించవు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ యాజమాన్యాలు పాతవిధానమైన ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలా? ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా? అన్న అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఈ జాప్యం డిగ్రీ ప్రవేశాలపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ నిర్వాకంతో రెండేళ్లగా డిగ్రీ ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయనేది గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. విద్యాశాఖ మంత్రి లోకేష్ వద్ద ఫైల్ కొన్ని రోజుల తరబడి పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతోంది. లోకేష్ మిగిలిన శాఖలపై పెత్తనం చలాయిస్తుండటంతో.. తన విద్యాశాఖపై కనీసం దృష్టి పెట్టలేకపోతున్నారన్న విమర్శలకు డిగ్రీ ప్రవేశాల ఉదంతమని విద్యార్థి సంఘాల ప్రతినిదులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 103 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 15 ప్రభుత్వ, 88 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 28 వేల సీట్లు ఉన్నాయి. కొన్నేళ్ల కిందట జిల్లా నుంచి 20 వేల వరకు సీట్లు నిండేవి. గత ఏడాది ఈ సంఖ్య పది వేలకు పడిపోయింది. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వ కళాశాలల్లో సైతం గతంలో పోలిస్తే ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల్లో ప్రవేశాలు తగ్గిపోయాయి. దీంతో కొన్ని సబ్జెక్టుల కాంబినేషన్ కోర్సులను మూసివేశారు. ప్రధానంగా బీఎస్సీ ఎంపీసీ, కంప్యూటర్స్ కోర్సులకు డిమాండ్ ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం వంటి కళాశాలకు డిమాండ్ ఉంది. ప్రైవేట్ కళాశాలలు తీసుకుంటే శ్రీకాకుళం నగరం, రూరల్, రాజాం, నరసన్నపేట, టెక్కలి వంటి ప్రాంతాల్లో 20 కళాశాలల్లో సీట్లకు డిమాండ్ ఉంది. ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉండటంతో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా అమలు చేయడంతో విద్యార్థులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా డిగ్రీలో ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది.

త్వరలో స్పష్టత..

డిగ్రీ ప్రవేశాలపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం. నోటిఫికేషన్ వస్తుంది. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రవేశాలు జరుగుతాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశాలు ఉంటాయి.

– డాక్టర్ కణితి శ్రీరాములు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాతపట్నం, శ్రీకాకుళం పురుషులు (ఎఫ్ఏసీ)

అడ్మిషన్లపై ప్రభావం..

డిగ్రీ ప్రవేశాలపై ప్రభుత్వం అనేక కసరత్తులు చేసింది. కాస్త ఆలస్యమైనమాట వాస్తవమే. ఈ ప్రభావం అడ్మిషన్లపై పడవచ్చు. నోటిఫికేషన్ జాప్యం కావడంతో ప్రైవేటు కళాశాలలవైపు విద్యార్థులు ఆకర్షితులయ్యే అవకాశం లేకపోలేదు. నోటిఫికేషన్ రెండు రోజుల్లో రావొచ్చు.

– డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

మూడు నెలలుగా నిరీక్షణ

ఇంటర్ ఎంపీసీలో 923 మార్కులు వచ్చాయి. ఇంజినీరింగ్‌పై ఆసక్తిలేదు. ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఎంపీసీఎస్ చదవాలని అనుకుంటున్నాను. ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలల కావొస్తుంది. ఇప్పటి వరకు నోటిఫికేషన్ రాకపోవడం దారుణం.

– ఎస్.పుష్పలత, విద్యార్థిని, శ్రీకాకుళం

ఆదిత్యుని సన్నిధిలో తొలి ఏకాదశి సందడి



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందడి కనిపించింది. ఆషాఢ శుద్ధ ఏకాదశి (శయన ఏకాదశి)గా జరుపుకుంటున్న క్రమంలో ఆదివారం అరసవల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్టుకు ప్రత్యేకంగా తులసీదళాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు సర్వదర్శనాలకు అనుమతించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. పలువురు సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు చేయించారు. కాగా, అన్నప్రసాద వితరణలో అధికారుల చర్యలపై భక్తులు బాహాటంగానే విమర్శించారు. తలనీలాల టిక్కెట్లు ధరల కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారంటూ భక్తులు ఫిర్యాదులు చేశారు.



కల్యాణసేవలో తాళిబొట్లను చూపిస్తున్న అర్చకులు సాందీప్ శర్మ

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం..

సూర్యనారాయణ స్వామి వారి కల్యాణ సేవ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో సూర్యనారాయణ స్వామి వారి ఉత్సవమూర్తులను కల్యాణమూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో కొలువుదీర్చారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, వేదపండితుల బృందం కల్యాణం జరిపించారు.

జీడీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్) యూనియన్, శ్రీకాకుళం డివిజన్ ద్వై వార్షిక మహాసభలు నిర్వహించారు. రాష్ట్ర నాయకులు, డివిజనల్ అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ మహాసభలలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తపాలా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం రెండేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు, రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.కె.జమాల్ బాషా, వై.స్వర్ణస్ రాజు, మాజీ రాష్ట్ర కార్యదర్శి వై.మల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గమిదే..

జీడీఎస్ అధ్యక్ష కార్యదర్శులుగా బి.అప్పారావు, ఎస్.నందికేశ్వరరావు, కోశాధికారిగా పి.రామకోటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు దుర్మరణం



లక్ష్మీదేవి(ఫైల్)

రణస్థలం: పిషిని పంచాయతీ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడిభీమవరం పంచాయతీ లొడగలపేట గ్రామానికి చెందిన నొడగల తవుడు(70) అనారోగ్యం, మతిస్థిమితం కారణంగా తరచూ బయటే తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడి శరీరం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జుగా మారింది. కొన్ని గంటల తర్వాత తువ్వాలు, లుంగీ, చెప్పులను బట్టి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు.కుమారుడు తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హైవే సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో వాహనం గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

యువకుడు దారుణ హత్య

- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద బాకీ విషయమై గొడవ
- కత్తితో దాడికి పాల్పడిన షాపు నిర్వాహకుడు
- వసపలో విషాద ఛాయలు



లుకలాపు మిన్నారావు (ఫైల్)



మిన్నారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రసాదరావు, క్లూస్ టీమ్

కొత్తూరు: బాకీ విషయమై తలెత్తిన వివాదం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. ఈ విషాద ఘటన కొత్తూరు మండలం వసప గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసప గ్రామంలో మలగాన శంకర్ అనే వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. ఇతనికి అదే గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు(19) అనే యువకుడు బాకీ ఉన్నాడు. ఎప్పుడు వీరిద్దరూ కలిసిన బాకీ విషయమై గొడవ జరిగేది. తన డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని శంకర్ తరచూ బెదిరించేవాడు. ఈ క్రమంలో మిన్నారావు శనివారం రాత్రి పకోడీ కొనేందుకు శంకర్ షాపు వద్దకు వెళ్లాడు. ఇంతవరకు ఉన్న బాకీ తీర్చాలని శంకర్ అడగడంతో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో శంకర్ షాపులో ఉన్న సుత్తితో మిన్నారావు తలపై బలంగా కొట్టాడు. దీంతో మిన్నారావు కిందపడిపోయాడు. కొనఊపిరితో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా చాకుతో గొంతు కోసి హత్య చేశాడు. మృతదేహాన్ని షాపు ఎదురుగా ఉన్న పీహెచ్ రోడ్డు పక్కన పడేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం వేకువజామున రోడ్డు పక్కన మిన్నారావు మృతదేహం కనిపించడంతో అటువైపు వైపు వెళ్లిన స్థానికులు గుర్తించి మృతుడి లుకలాపు బుడ్డు, లక్ష్మిలకు తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా కనిపించడంతో విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ ఆమీర్ ఆలీ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి బుడ్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆమీర్ ఆలీ తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో ఈ హత్య జరిగి ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, మిన్నారావు రోజువారీ కూలీ పనులు చేస్తుండేవాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. అందివచ్చిన కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వివాహితను కబళించిన కిడ్నీ మహమ్మారి



లక్ష్మీదేవి(ఫైల్)

వజ్రపుకొత్తూరు: ఒంకులూరు గ్రామానికి చెందిన వివాహిత దుమ్ము లక్ష్మీదేవి(39) ఆదివారం కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమె కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. నెల రోజులుగా పలాస కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతోంది. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడం, మందులు వాడేందుకు పేదరికం అడ్డురావడంతో మధ్యలోనే తనువు చాలించింది. లక్ష్మీదేవి భర్త రాజు వ్యవసాయ కూలీ. వీరికి ఇంటర్మీడియట్ చదువుతున్న కుమార్తె ఉంది. గ్రామస్తులు, బంధువుల సహకారంతో గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఎఫ్.ఆర్.ఎస్ రద్దు చేయాలన్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నేటికి అమలు చేయలేదన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న చేపట్టనున్న అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, నాయకులు పి.లతాదేవి, కె.సుజాత, జె.కామేశ్వరి, కె.లక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి, జ్యోతి, మాధవి, అప్పలనర్సమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న

శ్రీకాకుళం న్యూకాలనీ : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని రైతుబజారు కూడలిలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షులు కొమ్ము అప్పలరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. యోగా దినోత్సవం, మెగా పేరెంట్స్ వంటివి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు చెల్లించకుండా అనవసరమైన కార్యక్రమాలతో బోధనకు ఆటంకం కలిగిస్తున్నారని దుయ్యబట్టారు. పెండింగ్ డీఏలు, బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఇన్‌చార్జిలు గురుగుబెల్లి రాజశేఖర్, ఎన్నిప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హరికథకు పునరుజ్జీవం



హరికథా భాగవతారిణి దివ్య శివను సత్కరిస్తున్న సుమిత్రా సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: హరికథకు పునరుజ్జీవనం చేస్తున్న సుమిత్రా కళాసమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో పులఖండం శ్రీనివాసరావు స్మారకంగా హరికథా నవరత్నల ప్రదర్శనలు మొదటి రోజు ఆదివారం ప్రారంభమయ్యాయి. గుంటూరుకు చెందిన తిరువళ్లూరి దివ్య శివ భాగవతారిణిని 'సుందరకాండ' కథను చక్కగా వినిపించగా, వయొలిన్‌పై మావుడూరి సత్యనారాయణ, వాయునందరావు, మృదంగంపై మావుడూరు సూర్యప్రసాదశర్మ వాద్య సహకారం అందించారు. ముందుగా కళామందిరం ఆవరణలో ఉన్న హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, గౌరవాధ్యక్షుడు కొంచాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ చిన్నవయసులోనే హరికథను నేర్చుకొని చెప్పడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, నక్క శంకరరావు, నీరజా సుబ్రహ్మణ్యం, బంకుపల్లి రమేష్‌శర్మ, పూసర్ల నగేష్, కొంక్యాన మురళీధర్, వి.వి.ఆర్ మూర్తి, ఎం.రాజు, ఎం.వరలక్ష్మీ, పూజ, ఉషారాణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● అ'పూర్వ' సమ్మేళనం



పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. పాఠశాలలో 1971–72 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 53 ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.

– పాతపట్నం